హైదరాబాద్ వార్త



# చేతి వేలికి సిరా గుర్తు.. వాడుకలోకి ఇలా..

హైదరాబాద్ నవంబరు 26 ప్రభాతవార్త : దేశంలో ఎన్నికలు జరిగినా ప్రతిసారి చేతి వేలికి సిరా గుర్తు తప్పని సరి వేస్తారు. నేరేడు రంగులో ఉండే సిరా కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో తయారు చేస్తారు. ప్రతి ఓటరు తాను ఓటు హక్కును వినియోగించుకున్నానని చెప్పడానికి ప్రధాన గుర్తు వేలికి పెట్టే సిరా చుక్క. ఎన్నికల్లో బోగసు, రీసైక్లింగ్ ఓట్లను అరికట్టేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈ సిరా చుక్క పద్దతిని ప్రవేశపెట్టింది. మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ ఉత్పత్తి చేస్తుంది. చెరిగిపోని గుర్తు వేలిపై వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ సిరాలో 7.25 సిల్వర్ నైట్రేట్ ఉండడం వల్ల వెంటనే చెరిగిపోదు. ఒక్కసారి వేలికి అంటిన ఇంకు దాదాపు 72 గంటల పాటు చెరిగిపోకుండా ఉంటుంది. 1962 ఎన్నికల నాటి ఉంచి దీనిని వాడుకలోకి తెచ్చారు. 2006కు ముందు ఓటరు గోరు చర్మంపై మాత్రమే వేసేవారు. తర్వాత ఎడమ చేతి చూపుడు వేలు గోరుపై భాగం నుంచి కింది వరకు గుర్తుగా వేస్తున్నారు. ఈ సిరాను మన దేశంలోని ఎన్నికలకే కాదు 29 దేశాలకు సరఫరా చేస్తారట. శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఈజిప్టు, సిరియా, ఇరాక్, ఇండోనేషియా, నేపాల్, మయన్మార్, దక్షిణాఫ్రికా, సుడాన్, ఆస్ట్రేలియా, టర్కీ, అల్జీరియా వంటి తదితర దేశాల్లో ఎన్నికల సమయంలో ఇక్కడి నుంచి సరఫరా అయిన సిరానే వాడుతున్నారు. మైసూర్ మహరాజ్ నాల్మడి కృష్ణరాజు వడయారు ఈ కంపెనీని స్థాపించారు. స్వాతంత్ర్యానికి ముందు వరకు మైసూర్ రాజుల ఆధీనంలో ఉన్న ఈ కంపెనీ ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో దాదాపు 2.5 లక్షల సీసాలు అవసరం అవుతాయని ఎన్నికల సంఘం భావించి వాటిని సిద్ధం చేసింది. ఒక్కో సీసాలో 600-700 మంది ఓటర్ల వరకు గుర్తు వేయవచ్చు.

## యాదగిరిగుట్ట మూల విరాట్ విగ్రహం ఏమైంది?

**నిధిపై సిఎం కెసిఆర్ బాహ్యప్రపంచానికి ఎందుకు వెల్లడించలేదు**

**నిజనిర్ధారణ కమిటి డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్. ప్రభాకర్‌రెడ్డి

సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి మూలవిరాట్ పురాతన విగ్రహం ఏమైందనేది మిస్టరీగా మారిందని, దేవాలయం అధికారులు, పూజారులు, ఇతర సిబ్బంది విగ్రహంపై పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పలు సందేహాలకు తావిస్తున్నదని శ్రీలక్ష్మీనర్సింహస్వామి భక్త సమితి నిజనిర్ధారణ కమిటి ఆరోపించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రతినిధి కృష్ణంరాజు తదితరులు మాట్లాడుతూ తమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటి యాదగిరిగుట్టను ఇటీవల సందర్శించి అక్కడి విషయాలను పరిశీలించి నివేదికను సమర్పించిందన్నారు. నివేధిక ప్రకారం మూడు అడుగులుగా ఉన్న స్వయంభూ దేవాలయాన్ని 12 అడుగుల లోతుకు తవ్వింది నిజమేనని తమ విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. కాకతీయ రాజు రుద్రదేవుడి కాలంనాటి 1050 ఏళ్ళ క్రితం శిలాశాసనం ఇటీవలే లభ్యమైందన్నారు. ఆయన రాజ్య పరిసర ప్రాంతాల్లోని దేవాలయాలకు బంగారం, వజ్రవైఢ్యూరాలు, ఇతర రకాల దానాలు చేయాలని శాసనంలో రాసి ఉందని, దాని ప్రకారం ఆయనతోపాటు అక్కడి భక్తులు దేవాలయానికి ఆనేక విలువైన అభరణాలు దానం చేసినట్లు స్పష్టమవుతున్నదన్నారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో వైష్ణవక్షేత్రమైన శ్రీఅనంత పద్మనాభస్వామి దేవాలయంలో కోట్ల రూపాయలు విలువైన బంగారు వజ్ర వైఢూర్యాలు, ఇతర రకాల కానుకలతో కూడిని నిధి ఉన్నదని, ఆ లేక్కన వైష్ణవక్షేత్రం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ప్రాంగణంలో కూడా విలువైన సంపద ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### అడ్డగుట్ట కార్పోరేటర్ ఇంటిపై సోదాలు

అడ్డగుట్ట,నవంబర్ 26 ప్రభాతవార్త: సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ అనుచరులు రాత్రి అడ్డగుట్టలో నివాసం ఉంటున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న ఇంట్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ పోలీసులకు సమాచారం అందించారు.



ముగ్ధ మనోహరం నవరసభరితం నర్తనరవళి

రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కూచిపూడి శిక్షణా సంస్థ కళానృత్యనికేతన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శింపబడిన నర్తన రవళి ముగ్ధమనోహరం, నవరసభరితంగా సాగి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.



# తుది దశకు ప్రచారం

## ఇక మిగిలింది పంపకాలే



హైదరాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త : ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు రోజులు మాత్రమే ఉంది. ఈ కొద్ది సమయం అన్ని పార్టీల అభ్యర్థులకు ఎంతో కీలకం. ఎలాగైనా ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని బహుముఖ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ అభివృద్ది సంక్షేమాలే ఎజెండాగా ముందుకు సాగింది. ఇక ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మాత్రం అధికార పార్టీ లోపాలను, అవినీతిని, అక్రమాలను, నిరంకుశత్వాన్ని, నిరుద్యోగుల గోస, రైతుల కష్టాలను ఎత్తిచూపుతూ బరిలో ముందుకు నిలిచింది. బిఆర్ఎస్ ప్రజావ్యతిరేక ఓటును బలపర్చుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఇక బిజెపి మాత్రం ఎప్పటిలాగానే మోదీతో ముందుకు సాగుతుంది. నెల రోజులుగా ఎన్నికల కోలాహలం చివరి దశకు చేరుకుంది. టికెట్ కేటాయింపు, నామినేషన్లు, జంపింగ్‌లు, ప్రచారం.. ఇక తాయిలాకు తెరలేచింది. నవంబరు 9న నామినేషన్ పూర్తి అయిన తర్వాత అక్కడ నుంచి ఎన్నికల ప్రచారం నెమ్మదిగా మొదలైంది. ఆ తర్వాత 15న ఉపసంహారణ తర్వాత ఎన్నికల ప్రచారం బేగం పుంజుకుంది. ఆ వేగం క్రమంగా జాతీయ నాయకులు బిజెపి నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సిద్దరామయ్య, డికె శివకుమార్, పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అధికార బిఆర్ఎస్ పార్టీ నుంచి సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, బిఎస్‌పి నుంచి ఆపార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితర నేతలు బహిరంగ షభలు, రోడ్ షోలతో ఎన్నికల ప్రచారాన్ని ఉగ్రూతలూగిస్తున్నారు. పార్టీ కీలకనేతలు, అభ్యర్థులు తమ కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం ఇప్పటికే రెండు దఫాలుగా నిర్వహించి తమకు ఎందుకు ఓటేయాలో ప్రజలకు వివరించి చెప్పారు. అయితే ప్రజలు ఎవరు సభలకు పిలిచినా ర్యాలీలకు పిలిచినా భారీగా తరలివెళ్తున్నారు. కానీ ఓటు ఎవరికి వేస్తారు అని అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలింది.

ఎన్నికలు అనగానే అదో పండుగ వాతావరణంలా కనిపిస్తోంది. ఎందుకంటే నామినేసన్ మొదలుకొని ఓట్లు వేసే నాటి వరకు ఎక్కడ చూసినా జన సందోహం కనిపిస్తుంది. ఉదయం ప్రచారం, సాయంత్రం దావతుల మీద దావతులు జరగడం సహజం. ఇది ఇలా ఉంటే ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచి ఓటుకు నోటు విలువ కట్టి కొనుగోలు చేయడం రాజకీయ నాయకులకు తెలిసిన విషయమే. ఓటు కోసం డబ్బు, మద్యం పంపిణి కావాల్సి ఉంది. అధికార పార్టీ నేతలు హాట్ నుంచి ఓటు దక్కించుకునేందుకు కొంత ఎక్కువ సమయం చెట్టించి ఓట్లు వేయించుకోవాలని నిర్ణయంతో ఉన్నారు. డబ్బు ఖర్చయింది అనేది ముఖ్యం కాకుండా గెలిచామా లేదా అన్నది ప్రధానంగా అధికార పార్టీ నాయకులు అడుగులు వేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పంపకాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే రూ. 2వేల నుంచి రూ. 3వేలు ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల మాత్రం పోలింగ్‌కు రెండు రోజుల ముందు పంపిణి కోసం పోలీసుల కంటపడకుండా నగదును కీలకమైన నేతల ఇళ్లకు చేర్చారు. అయితే పదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉఆన్నరని సమాచారం. ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత వల్ల తమకు కలిసి వస్తుందని అధికార పార్టీ ఇచ్చిన స్థాయిలో తాము డబ్బులు ఇవ్వలేమని కాంగ్రెస్ నాయకులు బస్తీల్లో ఓటర్లకు నచ్చ చెబుతున్నట్లు తెలుస్తోంది. అయితే అభ్యర్థులకు సంబంధించిన డబ్బులు, మద్యం దాదాపుగా ఇప్పటికే చేరినట్లు తెలుస్తోంది. పోలింగ్ సమయం సమీపించడంతో ప్రధాన పార్టీలు తాయిలాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అన్ని రోజులు ఒక ఎత్తు చివరి రోజు మరోఎత్తు అన్న విధంగా ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. ప్రత్యర్థుల కంటే ముందే ఆకట్టుకోవాలనే లక్ష్యంతో నగరంలో అన్ని పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. బస్తీలు, కాలనీల వారీగా, వర్గాల వారీగా తాయిలాలు ప్రకటి స్తూ.. వారికి కావాల్సింది చేస్తూ.. ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పాటా పోటీగా సభలు, రోడ్డు షోలు, పాదయాత్రలకు విచ్చ లవిడిగా డబ్బులు వెదజల్లి జనాలను సమీకరిస్తున్నారు.

## నేడే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రోడ్‌షో

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి నారాయణగూడ వరకు కనివిని ఎరుగని భద్రతా ఏర్పాట్లు**

**ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీజీ భద్రతా దళాలు**

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి నారాయణగూడ వరకు కాలినడకన అణువణువు పరిశీలించిన ఎస్పీజీ అధికారులు**

**భద్రతా ఏర్పాట్లు లోపించకుండా కఠినమైన నిబంధనలు**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నగర పోలీసు కమిషనర్ సందీప్ సాండిల్యా

హైదరాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం సాయంత్రం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి నారాయణగూడ చౌరస్తా, వైఎంసిఏ మీదుగా వీర్ సావర్కర్ వరకు నిర్వహించబోయే రోడ్‌షో సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లుచేస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ సందీప్ సాండిల్యా స్వయంగా భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రధానమంత్రి ప్రత్యేక భద్రతాదళం స్పెషల్ ప్రొటెక్షన్‌గ్రూప్(ఎస్‌పీజీ)కు చెందిన ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు స్థాయి అధికారులు ఒకరోజు ముందుగానే ప్రధానమంత్రి రోడ్‌షో నిర్వహించే ప్రాంతాలన్ని పర్యటించారు. ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి చిక్కడపల్లి మీదుగా వెళ్లే కాన్వాయ్ సందర్భంగా బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాలు, భద్రతకు ఇబ్బందిగా ఉన్న పరిసరాలను పరిశీలించి స్థానిక చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తగిన ఆదేశాలను జారీ చేశారు. నగర పోలీసు కమిషనర్ సందీప్ సాండిల్యా, డీసీపీలు, ఏసీపీలు, సెంట్రల్ జోన్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్ బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బిజెపి తెలంగాణ ఎన్నికల వ్యవహారాల కమిటీ సభ్యుడు ఎడెల్లి అజయకుమార్ తదితరులు పోలీసు అధికారుల వెంట ఉన్నారు. కాగా మధ్యా హ్నం3 గంటలకే ప్రధానమంత్రి భద్రతా సిబ్బంది పిఎం పర్యటించే ప్రాంతాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోనున్నారు.

### రాహుల్‌గాంధీని కలిసిన ఆళ్ల రామకృష్ణ

సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలగించబడిన 26 కుల సంఘాల పోరాట కమిటి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, అతని ప్రతినిధి బృందం ఆదివారం ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా కలిశారు. రామకృష్ణ, ఆయన బృందం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కా ంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నందుకు రాహుల్‌గాంధీ రామకృష్ణను, ఆయన బృందాన్ని అభినందించారు. దేశంలో కులగణన కోసం తొలిసారిగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన వ్యక్తి రామకృష్ణ. కుల గణన సమస్యపై ఇటీవల జరిగిన పరిణామాలను రామకృష్ణ, రాహుల్‌గాంధీకి వివరించారు.

## నయనానందకరం హిమాలయ చెరువులు ఛాయాచిత్రాలు



నాంపల్లి, నవంబరు 26 ప్రభాతవార్త : ద వాక్ ఆఫ్ వాటర్ (నదులు, చెరువులు శాంతి వెలుగులకు నిదర్శనం) పేరిట వారంరోజులపాటు నిర్వహిస్తున్న ఫోటోగ్రఫీ ప్రదర్శనలో వెంకటగిరిరాజా సత్యప్రసాద్ యాచేంద్ర తీసిన నదులు, చెరువులు ఛాయాచిత్రాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భారతదేశంలోని హిమాలయ ప్రాంతాల్లో ప్రవహించే స్వచ్ఛమైన నీరు దేశప్రజల వెలుగు, శాంతికి నిదర్శనమైన అందమైన చెరువులు, నదీప్రవాహాల అనేక చిత్రాలను కెమారాలో బంధించి ప్రదర్శనలో నిర్లిప్తం చేశారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రతీరోజూ తిలకిస్తున్న అనేకమంది ఫోటోప్రియులు, ప్రకృతి ప్రేమికులు ఛాయాచిత్రకారుడు సత్యప్రసాద్‌ను ఎంతగానో అభినందిస్తున్నారు. ఈ ద వాక్ ఆఫ్ వాటర్ ఫోటోగ్రఫీ ప్రదర్శన ఉదయం 11 నుండి రాత్రి 7గంటల వరకు ఔత్సాహికులైన సందర్శనార్థం తెరిచి ఉంటుందని నిర్వాహులు తెలిపారు.

## పథకాలను, అభివృద్ధిని చూసి బిఆర్ఎస్‌ను గెలిపించాలి : మంత్రి తలసాని



5వ వార్డు సంజీవయ్య నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య

కంటోన్మెంట్, నవంబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో తొమ్మిదిన్నర బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఏమిటో చేసి చూపించామని సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్, వాల్మీకి నగర్, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మంత్రి తలసానికి, అభ్యర్థి లాస్య నందితకు శాలువాలు, పూలమాలలతో సత్కరించి మంగళహారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు గజ్జెల నాగేశ్, ఎం.ఎన్.శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు పెద్దాల నర్సింహ్మా యాదవ్, తేలుకుంట సతీష్ గుప్త, కిరణ్ కుమార్, షర్వీన్, పెంట శ్రీహరి, ముప్పిడి గోపాల్, దేవుడు, సంకి రవిందర్ బాబు పాటు వందలాది మంది ప్రచారంలో పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పార్కులను ఎంతో అభివృద్ధి చేశాం : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సంజీవరెడ్డి నగర్..** తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పార్కులను ఎంతో అభివృద్ధి చేశామని, వాకర్స్‌కు అన్ని సౌకర్యాలు కల్పించామని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం సనత్‌నగర్‌లోని కెఎల్ఎన్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్‌లలో వాకర్స్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్క్‌లలో పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణం, సౌకర్యాలు కల్పించడం వంటి అభివృద్ధి పనులతో పార్కులకు వచ్చేవారి సంఖ్య పెరిగిందన్నారు. కెఎల్ఎన్ పార్క్‌లో పాత్‌వేల నిర్మాణం, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యోగా సాధకుల కోసం షెడ్డును కూడా నిర్మించామన్నారు. మంత్రి వెంట సనత్‌నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, పార్క్ అధ్యక్షులు రమేస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, ఖలీల్, శ్రీనివాస్, సురేష్ గౌడ్, యోగా గురువు కృష్ణ, శేషగిరి, లలితా చౌహాన్, సుబ్బరాజు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ

**గాంధీనగర్‌లో జోరుగా నేతల ప్రచారం**



చిక్కడపల్లి, నవంబరు 26 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తెస్తే రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నేతృత్వంలో కుటుంబ పాలనలో లక్షల కోట్లు కూడబెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీనాయకురాలు అరుణ జయేందర్, గుండు జగదీశ్‌బాబు, జి.జయేందర్‌బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్బార్టీ జవహర్‌నగర్, అశోక్‌నగర్, సంజీవ్‌నగర్ తదితర ప్రాంతాలలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బంటారం యాదగిరిగౌడ్, శంకర్‌గౌడ్, అస్లామ్, జయరామ్, సుకుమార్ తదితరులతో కలిసి ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ 'హస్తం' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కాని ఫలితాలన్ని కెసిఆర్ లాంటి దొరలు అనుభవిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజలందరు ఇది గమనించి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని తెలంగాణ ఇచ్చింది, రెండు రాష్ట్రాల నష్టవస్తుందని తెలిసినా కూడా ధైర్యంగా తెలంగాణను ప్రకటించిందన్నారు.

## కమలానికి ఓట్లేయండి.. కబ్జాదారులను సాగనంపండి

**రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ■ గండిపేట మండలంలో రోడ్‌షోకు భారీ స్పందన**



గండిపేట మండలంలో ప్రచారం చేస్తున్న రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 26 ప్రభాతవార్త : కమలానికి ఓట్లేయండి.. కబ్జాదారులను సాగనంపండి అని రాజేంద్రనగర్ బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గండిపేట మండలంలోని వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట్, మంచిరేవుల, నార్సింగిలలో బిజెపి భారీ రోడ్‌షోను నిర్వహించింది. ఏ గ్రామానికెళ్లినా భారత్‌మాతాకీ జై... జైశ్రీరాం... జైజైశ్రీరాం... నరేంద్రమోడీ నాయకత్వం వర్థిల్లాలి, వందేమాతరం అంటూ కార్యకర్తలు చేసినా నినాదాలతో ఆయా గ్రామాలు దద్దరిల్లాయి. రోడ్‌షోలను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మైలార్‌దేవుపల్లిలో రెండుమార్లు కార్పోరేటర్‌గా అవకాశం ఇచ్చారని, 103.కోట్లతో అభివృద్ది చేసి చూపించానని తెలిపారు. అలాగే ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వెయ్యి కోట్లతో అభివృద్ది చేసి చూపిస్తానని వివరించారు. సంపాదించేందుకు రాజకీయం చేయడం లేదని, సేవ చేసేందుకే ఈ మార్గంను ఎన్నుకున్నానని తెలిపారు. మూడుమార్లు ఎమ్మెల్యేగా పని చేసినా రాజేంద్రనగర్‌లో నేటికీ మౌళిక వసతులు సరిగ్గా లేవన్నారు. నేటికి నల్లా కనెక్షన్లు, భూగర్భ డ్రైనేజీలు లేని గ్రామాలు చాలా ఉన్నాయన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం రాజధానికి ఆను కొని ఉన్నా వంద కిలోమీటర్ల దూరంలో కుగ్రామాల వలే వసతుల లేమి కనిపిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అసమర్థత వల్లనే ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. 100.కిలీమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మెల్యేలు వందల కోట్ల రూపాయలను తరలించుకెళ్లి అభివృద్ధి చేస్తుంటే సెక్రేటేరియట్‌కు 15.కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజేంద్రనగర్‌కు మాత్రం నిధులు తేవడం లేదన్నారు. తన ఎమ్మెల్యే కోటా నిధులు కూడా ఖర్చు పెట్టలేకపోతున్నారని ఆరోపించారు.



# నేడు శాంతి భద్రతలకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్

## కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు


ప్రచారంలో ఎమ్మెల్యే కృష్ణారావుకు తిలకం పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

కూకట్‌పల్లి, నవంబర్ 26, ప్రభాతవార్త : శాంతిభద్రతలకు కేర్‌ఆఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారిందని ప్రపంచంలో ఉన్న అతిపెద్ద కంపెనీలు హైదరాబాద్‌లో తమ పెట్టు బడులు పెట్టి ఇక్కడున్న యువతకు అనేక ఉద్యోగాలు కల్పి స్తున్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి డివిజన్‌లోని కార్పొరేటర్ సత్యనారాయణతో కలిసి ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. తన సొంత గ్రామమైన కూకట్‌పల్లినీ నేడు అన్ని రకాలుగా ఎటువంటి సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దానని అన్నారు. ఒకప్పుడు కూకట్‌పల్లిలో ఆడపిల్లలు మంచినీళ్ళ కోసం బిందెలతో నిలబడి నానావస్తులు పడేవారిని నేడు ఆ పరిస్థితి లేకుండా నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్‌లకు లక్షల్లో గ్యాలన్లతో నీటి ట్యాంకులు నిర్మించడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది లేకుండా భూగర్భ నీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. అంతేకాకుండా పేదళ్ళ కాలంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపారన్నారు. కూకట్‌పల్లిలోని 436 ఏళ్ల చరిత్ర గల రామాలయం పునర్నిర్మాణం చిత్తారమ్మ దేవాలయం, మసీదులు, చర్చీలు అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని, రాబోయే రోజుల్లో కారు గుర్తుపై ఓటు వేసి తిరిగి ముఖ్యమంత్రి కెసిఆర్‌ని ఎన్నుకుందామని తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని మాధవరం కోరారు.

# భారీ మెజారిటీని ఇవ్వండి.. బంగారు భవిష్యత్తును ఇస్తా

## ఎక్కడికి వెళ్లినా బ్రహ్మారథం పడుతున్న ప్రజలు: రాజేంద్రనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్


రాజేంద్రనగర్‌లో మైనార్టీలతో కలిసి భారీ రోడ్ చేస్తున్న ప్రకాశ్‌గౌడ్ దృశ్యం

నార్సింగి, నవంబర్ 26 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాకు భారీ మెజారిటిని ఇవ్వండి... బంగారు భవిష్యతును మీకిస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నియోజక వర్గంలోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లు, బస్తీలు, కాలనీలలో భారీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో మెజారిటీ, మైనార్టీ ప్రజలంతా నా వెంటే ఉన్నారని, వారి ఆశీర్వా దంతో నాలుగో సారి భారీ మెజారిటీతో గెలిచి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు డిపాజిట్లను తెచ్చుకోవడం కోసం తంటాలు పడుతున్నాయని, ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి నాకు అనూహ్యమైన స్పందన వస్తుందన్నారు. మణికొండలో నిర్వహించిన భారీ సభకు వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉత్సాహంగా పని చేస్తున్నారన్నారు. గత పక్షం రోజులుగా జోరుగా ఇంటింటి ప్రచారం, భారీ రోడ్‌షోలు, ర్యాలీలు, బహిరంగ సభలు విజయవంతం చేస్తున్నారన్నారు. పని చేసే వారికే ప్రజలు నాయకులుగా అవకాశం కల్పిస్తారన్నారు. రాజేంద్రనగర్ ప్రజలు గత మూడు ఎన్నికల్లో నా గెలుపులో భాగస్వామలయ్యారని, ఇప్పుడు నాలుగోసారి సైతం నా వెన్నంటే ఉన్నారని, ఇది నా అదృష్టమన్నారు. ప్రజలు నాపై పెట్టుకున్న విశ్వాసాన్ని మరింత పెంచుకొనేందుకు మంచి పనులు చేస్తానని తెలిపారు. ఎవరు, ఏ సమయంలో నా వద్దకు వచ్చినా వారి ఇబ్బందులను వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించానని వివరించారు. కాంగ్రెస్ మైనార్టీలను మోసం చేసేందుకు కుట్ర చేస్తుందని, మైనార్టీలంతా అప్రమత్తంగా ఉండి కారుకే ఓట్లు వేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కోరారు.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 26, ప్రభాతవార్త : తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజ కవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట్‌లో పిసిసి కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో మైనార్టీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నాటక రాష్ట్రం రోడ్డు రవాణాశాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, శివాజీ నగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అహ్మద్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్ మాట్లాడుతూ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదని, గత నాలుగు సంవత్సరాల నుండి ఇదిగో అదిగో అని చెప్పి ఊరిస్తూ వచ్చారని ఇంకా నువ్వు చేసేది ఎప్పుడు ? ఎక్కడ నీ అభివృద్ధి అంటూ ప్రశ్నించారు. ఓల్డ్ బోయినపల్లిలో యాభై లక్షల రూపాయలతో మోడల్ మార్కెట్ ఇంత వరకు ఆరంభానికి నోచుకోలేదని ప్రస్తుతం మీ బిఆర్ఎస్ నాయకులకు ఆ మోడల్ మార్కెట్ అసాంఘిక కార్యక్రమా లకి అడ్డాగా మారిందని ఆరోపించారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని అధికార పార్టీ నాయకులు ఉన్న ప్రాంతాల్లోని సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తిచేసి ప్రతిపక్ష నాయకులు ఉండే ప్రాంతాలలో ఉన్న రోడ్లన్నీ అసలు పట్టించుకోలేదన్నారు.

# క్రైస్తవుల సంక్షేమానికి నిరంతరం కృషి : పద్మారావుగౌడ్


మాట్లాడుతున్న అభ్యర్థి పద్మారావుగౌడ్

మెట్టుగూడ, నవంబర్ 26 ప్రభాతవార్త: నియోజక వర్గంలోని క్రైస్తవుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని అభ్యర్థి పద్మా రావుగౌడ్ పేర్కొన్నారు. మెట్టు గూడలోని సెయింట్ మార్క్స్ చర్చ్‌లో జరిగిన కార్యక్రమం లో పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆయనను ఆశీర్వదించారు. ఈ సందర్భం గా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రైస్తవుల ప్రయోజనాల పరిరక్షణకు పాటు పడ్డానని, చర్చిలకు అండగా నిలిచానని చెప్పారు. చర్చ్ పునర్నిర్మాణం కోసం పద్మారుగౌడ్ కీలకంగా వ్యవహరించారని ప్రతినిధి మోజెస్ ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రాసూరి సునిత, కిషోర్ కుమార్ గౌడ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవ పురోగతికి గణితం కీలకం

## మానవహక్కుల కమిషన్ కార్యదర్శి డిఆర్‌గార్గ్


గణితంపైనిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త: విద్యార్థులు గణితంపై నైపుణ్య శిక్షణ తీసుకుంటే దానిపట్ల గలవైఖరిలో విపరీతమైన మార్పు వస్తుందని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ కార్యదర్శి డిఆర్ గార్గ్ అన్నారు. ఈమేరకు ఆదివారం దేశంలోఅతిపెద్ద నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఐపి అకాడమీ నేషనల్ ప్రాడిజీ-2023 పేరిట 20వ జాతీయ అబాకస్ పోటీలను క్లాసిక్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. దీనికి గార్గ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. దీనికి దేశనలుమూలల నుంచి 4700మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 ఏళ్లలోపు పిల్లలు 11 నిమిషాల్లో 300 లెక్కలను పరిష్కరించి తాము మానవ కాలిక్యూలెటర్లమని నిరూపించారు. ఈసందర్భంగా డిఆర్‌గార్గ్ మాట్లాడుతూ సైన్స్,టెక్నాలజీ, కంప్యూటర్లు మానవపురోగతికి గణితం కీలకం అన్నారు. విద్యార్థి గణితంలో నమ్మకంగా ఉంటే అతని సామర్థ్యాన్ని ఏవరూ ఆపలేరన్నారు. నిర్వాహకులు దినేష్ విక్టర్ మాట్లాడుతూ అబాకస్ ప్రోగ్రామ్ ఏకాగ్రత వంటి నైపుణ్యాలను అందిస్తుందన్నారు. అంకగణితంతో మెరుగైన పనితీరు, ఆత్మవిస్వాసం, దృశ్యనైపున్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

## జగదీశ్వర్‌గౌడ్‌కు మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు


కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 26 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రమ్మరథం పడుతున్నారని, ఎన్ని కల్లో గెలిపించేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గం పరిధి లోని పలు ప్రాంతాల్లో జగదీశ్వర్‌గౌడ్ ప్రచారం నిర్వహిం చగా, ప్రచారానికి వచ్చిన జగదీశ్వర్‌గౌడ్‌కు స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలి కారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ పార్కులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. మాదాపూర్ డివిజన్ పరి ధిలోని కాకతీయ హిల్స్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి జగదీశ్వర్‌గౌడ్ హాజరై స్థానికులను ఓటు అభ్యర్థించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్తాలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండాపూర్‌లోని బొటా నికల్ గార్డెన్‌లో పద్మాశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభో జనాల కార్యక్రమానికి జగదీశ్వర్‌గౌడ్ హాజరై పద్మాశాలి సోదర, సోదరీమణులతో సమావేశమ య్యారు. చందా నగర్‌లోని ప్రశాంత్‌నగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వన భోజన కార్యక్రమానికి జగదీశ్వర్ గౌడ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ కుల, మత, వర్గ, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమా నికి ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. దివంగత వైఎస్ ఆర్, పిజె ఆర్‌లు శేరిలింగంపల్లి ప్రాంత అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. శేరిలింగంపల్లి నియోజ కవర్గం పరిధి లో ఐటి సెక్టార్‌కు బాటలు వేసి ఈ ప్రాంత అభివృద్ధికి నాంది పలికింది కాంగ్రెస్ పార్టీ అన్నారు.

# ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి


అంబేద్కర్ విగ్రహం ఎదుట మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: స్వేచ్ఛా, సమాన త్వం, సౌభ్రాతృత్వం పునాదిగల సోషల్ జస్టిస్ సంవిధాన్ ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ జాతికి అంకితం చేశారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ చెప్పారు. కాని 75 ఏళ్ళ రాజ్యాంగ ఫలాలు దేశంలోని నిమ్నజాతుల కు దక్కకుండా దోపిడీ పాలకులు అడ్డుకున్నారని ఆయన విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ కార్యకర్తలు మోదీ సర్కార్ హఠావో, సంవిధాన్‌కు బచావో అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ మనువాదుల మాఫియా సర్కార్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో వైదిక మత మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బిసి మత మైనార్టీ జాతుల మానవ జీవన హక్కులు రద్దు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నారని చెప్పారు. దళిత బహుజన ప్రజలందరూ ఈ రాజ్యాంగాన్ని కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్‌రావు, పార్టీ నాయకులు ఇటికాల గణేష్, శాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి వ్యతిరేఖ పార్టీలను ఓడించాలి: బిసి పొలిటికల్ ఫ్రంట్ పిలుపు



సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ మరళీమనోహార్, సమ్మయ్య

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త: రాష్ట్రంలో ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలల్లో బిసివ్యతిరేక పార్టీలైన బిఆర్ఎస్,బిజెపి, ఎంఐఎంలను ఓడిం చాలని బిసి పొలిటికల్ ఫ్రంట్ (బిసిపిఎఫ్) బిసి ఓటర్లకు పిలుపునిచ్చింది. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసిపిఎఫ్ అధ్య కార్యదర్శులు ప్రొఫెసర్ మురళీ మనోహార్, సమ్మయ్యలు మాట్లాడారు. గత పదిసంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి వాటిని సైతం ఖర్చు చేయలేదని విమర్శించారు. ఒక దేశాన్ని పాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం బిసి జనగణన చేపట్టకపోవడమే కాక దేశంలో సగానికి పైగా ఉన్న బిసిలను మోసగించిందని మండిపడ్డారు. అలాగే బిసినేతను ముఖ్యమంత్రి చేస్తామంటూ బిజెపి ప్రకటనలు సమర్థిస్తూ బిసిలంతా బిజెపికి ఓటు వేయాలంటూ మందకృష్ణ చేసిన వ్యా ఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. బిజెపి మోసపూరిత హామీలకు మందకృష్ణ వంత పాడడం విచారకరమన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకే మా మద్దతు : జమ్మూకాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ

హైదరాబాద్, నవంబర్ 26,ప్రభాతవార్త: అలుపెరగని పోరాటాలతో తెలంగాణను సాధించి రాష్ట్ర ఏర్పాటు అనంతరం దేశంలోనే అద్భుతమైన ప్రగతి సాధిస్తున్న రాష్ట్రంగా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్‌పార్టీకే తమ సంపూర్ణ మద్దతు అని జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్‌పార్టీ ప్రకటించింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ కృష్ణ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. గతంలో విద్యుత్ కోతలతో ,నీటికటకటలతో అలమటించిన రాష్ట్రం సమృద్ధిగా నీరు, 24గంటల కరెంట్ సాధించి అబివృద్ధికి బాటలు వేశారని అన్నారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ సంక్షేమం అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి కెసిఆర్ అని వీటన్నింటి నేపథ్యంలో బిఆర్ఎస్‌కు మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రతి ఇంటికి ఉచిత మంచినీటిని అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిది

## శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ


గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 26 ప్రభాతవార్త : నేడు నగరంలో ప్రతి ఇంటికి ఉచిత రక్షిత మంచినీటిని అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందజేసేందుకు కొత్తగా వేల కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి, నెలనెల 20వేల లీటర్ల ఉచిత రక్షిత త్రాగునీటిని అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, గుల్‌మోహార్ పార్కు కాలనీల్లో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి పర్యటించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని అపర్ణా జినిత్, అపర్ణా సైబర్‌జోన్, అపర్ణాలైఫ్, అపర్ణా సైబర్ కమ్యూన్, గ్రాండే, సరోవర్, సైబర్ ఎన్‌క్లేవ్, ప్రైమ్‌మార్క్స్, డైమాండ్ హైట్స్, నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీ, సాయినగర్ కాలనీ వాసులతో నిర్వహిం చిన ఆత్మీయ సమ్మేళనంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి పాల్గొని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, సిబిఆర్ ఎస్టేట్స్, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ వాసులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మొవ్వా సత్య నారాయణ, రఘునాథ్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ వాకర్లతో సమావేశమై బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని విశ్వనాథ గార్డెన్‌లో కమ్మసంఘం కార్తీక వనభోజన కార్యక్రమానికి డాక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు, బిఆర్ఎస్ నాయకులు మొవ్వా సత్యనారాయణ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. బిఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ కుమార్తె ప్రణీత గాంధీ భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గత తొమ్మిదిన్నరేళ్లుగా కోట్లాది రూపాయల నిధులతో అభివ ృద్ధి కార్యక్రమాలు చేపట్టా మని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గం ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు అందుబాటులో తీసుకువచ్చేందుకు 9వేల కోట్ల రూపాయలతో అభివ ృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిస్మత్‌పురలో కర్ణాటక మహిళ అదృశ్యం


అదృశ్యమైన చంద్రమ్మ

మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 26 ప్రభాతవార్త : కిస్మత్‌పురలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన డబ్బై సంవత్సరాలు వయస్సు గల ఓ మహిళ అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం,యాద్‌గిర్ జిల్లా,గురుమీత్‌కల్లా మండలం, చెపట్లా గ్రామానికి చెందిన చంద్రమ్మ (70) రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పుర,ఖలీజా ఖాన్ దర్గా గండిపేట్‌లో ఉంటున్న తన కూతురు వద్ద ఉంటున్నది.ఈ 20వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన చంద్రమ్మ తిరిగి ఇంత వరకు ఇంటికి రాలేదు.చంద్రమ్మ కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికింనా ఫలితం లేక పోయింది.నా తల్లి చంద్ర మ్మ కనిపించటం లేదంటూ కుమార్తె సంతోష రాజేంద్ర నగర్ పోలీ సులకు ఫిర్యాదు చేసింది.ఇంటి నుంచి చంద్ర మ్మ బయటకు వెళ్లిన సమ యంలో ఆకుపచ్చ చీర,జాకెట్టు ధరించి ఉంది.చంద్రమ్మ తెలుగు మాత్రమే మాట్లాడ గలదు. చంద్రమ్మ ఆచూకీ లభించి నచో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.


రోడ్ షోలో మాట్లాడుతున్న వివేకానంద

# అభివృద్ధిని ఆదరించండి

## బిఆర్ఎస్ పార్టీని మరోమారు గెలిపించండి : ఎమ్మెల్యే కెపి వివేకానంద

జీడిమెట్ల, నవంబర్ 26, ప్రభాతవార్త : 125 గాజులరామారం డివిజన్ విఎస్ఆర్ సెలెస్టియల్ టవర్స్ నందు ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేన్నరేళ్ళ కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిని స్వాగతిస్తూ మరింత అభివృద్ధి చేసేందుకు నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో మూడవ నెంబర్‌పై ఓటు వేసి ముచ్చటగా మూడవసారి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు విజయరాంరెడ్డి, సీనియర్ నాయకులు రషీద్‌బేగ్, కమలాకర్, పరిషే శ్రీనివాస్ యాదవ్, గోవర్ధన్, బాబీ, చిన్నా చౌదరి, విఎస్ఆర్ సెలెస్టియల్ టవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.వి.శివకుమార్, ఉపాధ్యక్షులు ఎ.అరుణ, కోశాధికారి జి.సతీష్, కార్యదర్శి పి.స్వప్న, సంయుక్త కార్యదర్శి కె.వి. రంగారెడ్డి, సభ్యులు టి.రాధా కిషన్, ఎం విజయలక్ష్మీ, జి.వి. బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ షోను ప్రారంభించిన కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి



నిజాంపేట్, నవంబర్ 26, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట ప్రగతినగర్ వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి రోడ్‌షోను ప్రారంభించారు. ఆదివారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన రోడ్ షో ప్రగతి నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, శ్రీనివాస కాలనీ మధురా నగర్, ప్రశాంతి హిల్స్, సైదప్ప బస్తీ మీదుగా ఆర్‌జికె, రాజధాని స్కూల్ బండారి లేఅవుట్, రెడ్డి అవెన్యూ, పుష్పక్ రోడ్, ఈశ్వర్ విల్లాస్, భవ్యాస్, నిజాంపేట కమాన్, సెట్విన్ కాలనీ, ఈ ఫేస్ 3, ఫేస్ 2, బాలాజీ హిల్స్, కెటిఆర్ కాలనీ, బాలాజీ నగర్, తిరుమల నగర్, శ్రీనివాస్ కాలనీ, వినాయకనగర్, ఈ ఫేస్ 1, బాలాజీ కాలనీ, వెంట్రాయ నగర్, సిరి ఎంక్లేవ్, నారాయణరెడ్డి కాలనీ, చైతన్య కాలేజ్ నుండి టెంపుల్ బస్ స్టాప్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లింలను మోసం చేసిన బిఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతాం : సిరాజ్

కంటోన్మెంట్, నవంబర్ 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లో ముస్లింలను మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని కంటోన్మెంట్ ముస్లిం మైనార్టీ నాయకుడు మహ్మద్ సిరాజ్ హెచ్చరించారు. ఆదివారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిరాజ్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్‌గా విధులు నిర్వహించిన తాను గత కొంత కాలంగా రాజకీ యాలకు దూరంగా ఉంటున్నామన్నారు. అయితే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత గెలుపుకు ఇటీవల బిఆర్ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. అయితే కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి వైఖరి నచ్చకపోవడంతో తాను బిఆర్ఎస్ పార్టీని కంటోన్మెంట్ కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# రాజ్యాంగం ఒక పవిత్రమైన గ్రంథం.. భద్రపరుచుకోవాలి

## హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శిని



సైఫాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన పెంచుకోవాలని, భగవద్గీత, కురాన్, బైబుల్ వలే రాజ్యాంగ గ్రంథం ఇళ్ళలో ఉంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టీస్ ఎం.జి.ప్రియదర్శిని సూచించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం పొందుపరిచి ఉన్నాయని, అలాగే ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ఉన్నాయని ఆమె వివరించారు.

# కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా కార్మికుల ర్యాలీ

జీడిమెట్ల, నవంబర్ 26, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా రాష్ట్ర కార్మిక నాయకులు చింతల నాగరాజు జీడిమెట్ల పారిశ్రామిక వాడలో సుమారుగా పదివేల మంది కార్మికులచే ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నాగరాజ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఏపీసీసీ మెంబర్ డాక్టర్ చింతల యాదగిరి, మేడ్చల్ యాదగిరి, మేడ్చల్ జిల్లా ఐఎన్టీయూసీ ఐలయ్య, ఆనంద్, దేవేందర్, శ్రీనివాసులు, నిరంజన్, ఎమ్మెస్ రాజులు పాల్గొన్నారు.

# బుల్‌డోజర్ సర్కార్‌తోనే తెలంగాణాలో మాఫియా అంతం : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



సమావేశంలో ప్రసంగిస్తున్న పవన్‌కళ్యాణ్ చిత్రంలో సామ రంగారెడ్డి

**సైదాబాద్, వనస్థలిపురం, నవంబరు 26 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పాలనలో తెలంగాణారాష్ట్రం మాఫియాకుఅడ్డాగా మారిందని ఇక్కడ బుల్‌డోజర్ సర్కార్ రావాల్సిన అవసరముందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఎల్‌బినగర్ బిజెపిఅభ్యర్థి సామ రంగారెడ్డికి మద్దతుగా కర్మన్‌ఘాట్ లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో ఎల్‌బినగర్‌లో బిజెపి తన సత్తా చాటుకుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి కేరాఫ్‌గా మారిందని, పేపర్ లీకేజీలు, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. గతంలో తెలంగాణా ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తే రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ మోసం చేస్తుందన్నారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ నినాదంతో బిజెపి ముందుకు వెళ్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగి ఉండేది కాదన్నారు. సామ రంగారెడ్డిని గెలిపించాలని కోరారు. ఎల్‌బినగర్ ప్రజలకు అయోధ్య రాముడి దర్శనం చేయిస్తామన్నారు. అంతకు ముందు డాక్టర్‌లక్ష్మణ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో మాఫియాను ఉక్కు పాదంతో అణచి వేయడం జరిగిందని, అదేవిధంగా ఎల్‌బినగర్‌కు బుల్‌డోజర్ రావాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి అభ్యర్థి సామ రంగారెడ్డి మాట్లాడుతూ ఎల్‌బినగర్‌లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. వరదముంపు సమస్యతో పాటు ఇతర సమస్యలపై బిజెపి పోరాటం చేసిందన్నారు. తనకు ఒక్క అవకాశమిచ్చి గెలిపిస్తే నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇక్కడి గెలుపు అంధ్రాలో వినిపించాలి : పవన్‌కళ్యాణ్...** వనస్థలిపురం రైతు బజార్ వద్ద జరిగిన బిజెపి, జనసేన కార్నర్ మీటింగ్‌కు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బిజెపి, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా బరిలో ఉన్న సామ రంగారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సామ రంగారెడ్డిని గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడి బిజెపి, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యేగా అభ్యర్థి గెలుపు ఆంధ్రాలో వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికారప్రతినిధి నాదేండ్ల మనోహర్, కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వరరెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి,కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, కొత్త రవీందర్‌గౌడ్, జనసేన అభిమానులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం : బిఎల్ఆర్



ఉప్పల్ మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



అభ్యర్థి లక్ష్మారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న గౌడ కులస్థులు

**ఉప్పల్, నాచారం, నవంబరు 26 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ పరిధిలోని కూరగాయల మార్కెట్, శ్రీనివాసా హైట్స్, చిలుకానగర్, పాత భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సిఎం కెసిఆర్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతిఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు అరటికాయల భాస్కర్,అన్న బాలకృష్ణ, సుక్క కిరణ్, సంతోష్‌రెడ్డి, నిరంజన్‌చారి, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎస్సీల సంక్షేమానికి కృషి : బిఎల్ఆర్...** మేరకు చిలుకానగర్ డివిజన్ మాదిగ సంక్షేమ సంఘం నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ మాదిగల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, పల్లె నర్సింగ్‌రావు, మాదిగ సంక్షేమ సంఘం నేతలు పి.నర్సింగ్‌రావు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

**గౌడ కులస్థులు మద్దతు... బీఎల్ఆర్...** నాచారం గీత పారిశ్రామిక సహకార సఘం అధ్యక్షులు మేడల మల్లికార్జున్ ఆధ్వర్యంలో నాచారం గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గౌడ కులస్థుల సంక్షేమంకోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు బీఎల్ఆర్‌కు మద్దతు తెలుపుతామని ఏకగ్రీవ తీర్మాణం చేశారు. అనంతరం ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, కిష్టయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్, విజయ్ చందర్‌గౌడ్, పూర్ణచందర్‌గౌడ్, రాజేష్, పాండుగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# గెలిపించండి... ఏడాదిలో సమస్యలను పరిష్కరిస్తా : మల్‌రెడ్డి



సాయికుటీర్‌లో మల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు



మల్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న పండుగుల జయశ్రీరాజు

**హయత్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త :** పదిహేనేళ్లుగా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో నగరానికి పక్కనే ఉన్న పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ అభివృద్ధి నామమాత్రంగానే ఉందని కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపుతానని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 4,5,6,7,8,9,23వ వార్డులలో పర్యటించారు. 9వ వార్డు నుంచి ప్రారంభమైన ప్రచారంలో మహిళలు ఆయనకు నుదుట కుంకుమను పెట్టి హారతులు పట్టారు. కాలనీవాసులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ జాతీయ రహదారికి పక్కనే ఉన్నా... ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో దశాబ్దాల కాలంగా సమస్యను పరిష్కరించలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ నిధులను సైతం స్థానిక సమస్యల పరిష్కారానికి వినియోగించకుండా లాక్కుంటోందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించక పోవడంతో సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు లక్షల కోట్లు దోచుకుంటుండగా... ఇటు ఇబ్రహీంపట్నంలో మంచిరెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వారిని అనుసరిస్తూ పేదలను దోచుకుంటున్నారని, అధికారులను సరిగా పనిచేయనీవ్వరని... కమిషనర్ ఎవరూ రెండేళ్ల పని చేసిన దాఖలాలు లేవన్నారు. మలక్‌పేట ఎమ్మెల్యేగా వెయ్యికి పైచిలుకు కాలనీలలో అభివృద్ధి పనులను చేసిన వ్యక్తిగా హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఏడాదిలో సమస్యలను పరిష్కరించి మార్పు చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొర్ర అనురాధ సురేష్, పసుల రాజేందర్, పండుగుల జయశ్రీరాజు, చల్లూరి మురళీధర్ రెడ్డి, సిద్ధంకి కృష్ణారెడ్డి, నాయకులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, దండెం రాజశేఖర్ రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌తో గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం : సుధీర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో భాగంగా కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి



గౌడ శెట్టిబలిజ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హయత్‌నగర్, నవంబరు 26 ప్రభాతవార్త:** అర్ధశతాబ్దం పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి సాధించలేదని దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ సాధించిందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడాసాయినగర్ నుంచి భాగ్యలతకాలనీవరకు 20 కాలనీలలో పాదయాత్ర చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేసేదిశలో ఉన్నారన్నారు. వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్నాటక రాష్ట్రంలో ఆర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అప్పుడే అటకెక్కాయని... ఇప్పుడు తెలంగాణలో వాటిని అమలు చేస్తామని మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వరదలు, కరోనా సమయంలో ప్రజలతో ఉంటూ వారి మంచి చెడు చూశానని, అభివృద్ధి విషయంలో వెనుకంజ వేయకుండా ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేశానన్నారు. 24 గంటల పాటు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా... 3 గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్లు అమ్ముకునే వ్యక్తులు రేపు రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తారని తెలిపారు. స్వంత కుటుంబ సభ్యుల ఆస్తులను ఆక్రమించే నాయకులు రేపు నియోజకవర్గ ప్రజల ఆస్తులకు ఎలా రక్షణకల్పిస్తారని... బీజేపీ ఓటు వేయడం వృధా అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే బీఆర్ఎస్ కారుగుర్తుకు ఓటువేసి మరోసారి తనను గెలిపించాలని కోరారు. అనంతరం కార్తీక మాసం సందర్భంగా బి.ఎన్.రెడ్డినగర్ డివిజన్ ఎన్.జి.వోస్ కాలనీ చత్రపతి శివాజి మైదానంలో గౌడ, శెట్టిబలిజ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో సుధీర్‌రెడ్డి, ఎల్.బి.నగర్ బీఆర్ఎస్ ఇంఛార్జీ రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మిప్రసన్నతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌సాగర్, గుడాలమల్లేష్, గుత్తా లక్ష్మణ్ రెడ్డి, అంజలిగౌడ్, జ్యోతిరెడ్డి, ఉమ, పి.వి.వి. సత్యనారాయణ, యాదయ్య గౌడ్, బాలరాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ప్రచారంలో అభివాదం చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఎల్.బి.నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:** వారంటీలు లేని గ్యారంటీలు ఇచ్చి కర్ణాటక ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను తెలంగాణలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్, ఆర్‌కెపురం డివిజన్, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు సంబంధించిన డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తెలంగాణను అభివృద్ధి చేస్తూ ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న సిఎం కెసిఆరే రాష్ట్రానికి పెద్ద గ్యారంటీ అని స్పష్టంచేశారు. కెసిఆర్ నాయకత్వమే ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి చెందని ఊరు, వాడా అంటూ అనేది ఏదీ లేదనీ అదే విధంగా సంక్షేమ పథకం అందని కుటుంబం లేదన్నారు. ఆర్‌కెపురం డివిజన్లో దాదాపు 800 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయిస్తామని తెలిపారు. సిఎం స్ఫూర్తితో మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు సంక్షేమాన్ని అందించామని వివరించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించి అభివృద్ధి, సంక్షేమాలను కొనసాగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, అరవింద్ శర్మ, పెండ్యాల నగేష్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, గొడుగు శ్రీనివాస్, పటేల్ సునీతరెడ్డి, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మహేశ్వరానికి సబితమ్మ నాయకత్వం అవసరం...** అభివృద్ధి, సంక్షేమంలో మహేశ్వరాన్ని ముందుకు తీసుకుపోతున్న సబితా ఇంద్రారెడ్డి నాయకత్వం ప్రజలకు అవసరమని బిఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆయన జల్‌పల్లి మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేసిన ఘనత కేవలం సబితమ్మకే దక్కుతుందని తెలిపారు. ప్రజల కష్ట నష్టాల్లో పాలుపంచుకున్న సబితమ్మనే ఈ ఎన్నికల్లో ప్రజలు విశ్వసించాలని కార్తీక్‌రెడ్డి కోరారు.

# ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి : ఉప్పల

**ఎల్.బి.నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త :** సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, టూరిజం శాఖ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ఐవిఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయిన సందర్భంగా కొత్తపేటలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ప్రతి సభ్యుడు కృషి చేయాలని సూచించారు.నూతన కమిటీ అధ్యక్షునిగా శ్రీధర సంపత్ గుప్త, ప్రధాన కార్యదర్శిగా లింగ శ్రీనివాస్, కోశాధికారిగా డోగిపర్తి రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా బ్రహ్మాదేవర విద్యాసాగర్, సహాయ కార్యదర్శిగా నాళ్ల విజయ్ కుమార్, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, ఐవిఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ అశోక అగర్వాల్, సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, పబ్బా చంద్రశేఖర్, కోడిపాక నారాయణ, కట్ట రవీందర్, ఉప్పల స్వప్న, చందా భాగ్యలక్ష్మి, కటకం శ్రీనివాస్, చింతల రజనీకాంత్ గుప్తా, పాల్గొన్నారు.

# తెలంగాణలో వచ్చేది కాంగ్రెసే.. గెలిచేది నేనే : కెఎల్ఆర్



ప్రచారంలో మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న కెఎల్ఆర్ సతీమణి విజయలక్ష్మి

**సరూర్‌నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నికలయ్యేది తానేనని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, మీర్‌పేట్, జిల్లెలగూడ తదితర ప్రాంతాల్లో రోడ్ షోల ద్వారా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ అవినీతి పాలన పట్ల విసిగిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టగానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సోనియా ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేస్తుందనే గట్టి నమ్మకంతో ప్రజలు ఉన్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమనీ ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని ఆయన కోరారు. మహేశ్వరం నియోజకవర్గానికి సేవకునిగా వచ్చిన తనను గెలిపించాలని కెఎల్ఆర్ కోరారు.

**మహిళలతో కలిసి కిచ్చెన్నగారి విజయలక్ష్మి ప్రచారం**

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎల్ఆర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి కిచ్చెన్నగారి విజయలక్ష్మి బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలోని వివిధ డివిజన్లలో పాదయాత్రలు చేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి తదితరులతో కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డుల కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన నిష్కల్మషి, అవినీతి మచ్చ లేని కెఎల్ఆర్‌ను గెలిపించాలని ఆమె కోరారు.

# జోరుగా బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు మర్రి రాజశేఖర్‌రెడ్డికి గెలుపు ఖాయం



ఈస్ట్ మారుతీ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, నవంబర్ 26 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే కేసీఆర్‌తోనే సాధ్యమని మల్కాజిగిరి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని మౌలాలి, ఈస్ట్ మారుతీనగర్‌లో బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, ఆసరా, దళితబంధు, స్వయం ఉపాధి వంటి ఎన్నో నూతన పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరికి చేరుతాయన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సిఎం కెసిఆర్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతిఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే ఆసరా పెన్షన్లు 5వేలు ఇస్తారన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇంటింటికి ప్రచారం చేసిన మమతారెడ్డి..** బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించాలని కోరుతూ ఆయన సతీమణి మర్రి మమతారెడ్డి ఆదివారం 140 డివిజన్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే అన్ని అభివృద్ధి పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. మల్కాజిగిరి అభివృద్ధికి మర్రి రాజశేఖర్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆమె కోరారు.



మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో బిజెపి ఆధ్వర్యంలో జరిగిన సకలజనుల విజయ సంకల్ప సభలో ప్రధాని మోడితో కరచాలనం చేస్తున్న నియోజకవర్గ భాజపా అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

# చంపాపేటలో 'ఓనస్ రోబోకాన్ 2023' సదస్సు

**సైదాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త:** చంపాపేట ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనస్ రోబోకాన్ 2023 సదస్సు కటింగ్ ఎడ్జ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీల గురించి లోతుగా చర్చించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 150కి పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా రోబోటిక్ అర్థోపెడిక్ సర్జరీలలో అనుసరిస్తున్న ఆధునిక వైద్యవిధానాల గురించి చర్చించారు. డా.బాలరాజునాయుడు, డాక్టర్ సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా ఒక శస్త్ర చికిత్సను నిర్వహించి రోబోటిక్ సర్జరీలో ఖచ్చితత్వాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించి చూపారు.

# మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

**ఉప్పల్, నవంబరు 26 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం తరంగిణి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ పద్మజ విశ్వాస్ శిష్య బృందం ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకట సంగీత,ం కూచిపూడి నృత్యాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రీనిత్య, ప్రణతి, అనికేర్, వైభవ్‌రెడ్డి తదితరులు కర్నాటక గాత్రం, శ్రీ గణేశా అన్నమాచార్య కీర్తనలు, అంటాష్టకం తదితర అంశాలను దీక్ష, షణ్ముఖ, ప్రియ వయోలిన్‌పై శ్రీ కార్తికేయ, సుహాన్, శివప్రీత్, మీనాక్షి, కీ బోర్డుపై త్రినయన్, ప్రణవ్, దరమ్మేశ్వర్‌రెడ్డి తదితరుల ప్రదర్శనలు ఇచ్చారు. ఆదివారం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు గ్యారంటీ : మధుయాష్కీగౌడ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 26 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కిగౌడ్ విజ్ఞప్తి చేశారు. నాగోల్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 58, ఫతుల్లగూడా, ఆక్వా పోలీస్ అపార్ట్మెంట్లలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మధుయాష్కిగౌడ్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే కాంగ్రెస్ ప్రజుత్వ క్యాబినెట్ మంత్రిగా అత్యధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. కబ్జాకోరల్లో చిక్కుకున్న ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలు సుధీర్‌రెడ్డిని ఓడించకపోతే విషపు కాటుకు బలైపోతారని అన్నారు. మూసీ నది మురికి తగ్గాలంటే, రౌడీయిజం పోవాలంటే, అవినీతి అంతం కావాలంటే, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బిజెపికి ఓటు వేస్తే సుధీర్ రెడ్డికి వేసినట్టే అన్నారు. నేను నీతి నిజాయితీగా ప్రజాబలంతో ఈ ఎన్నికలు గెలవబోతున్నానని అన్నారు. మా పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు నాకు మద్దతుగా సభలకు హాజరు కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. ముఖ్యమంత్రి ఎవరైనా సరే నియోజకవర్గానికి కావాల్సినన్ని నిధులను తీసుకొచ్చి పని చేయించే బాధ్యత నాది అన్నారు. ఆరు గ్యారంటీ స్కీముల అమలులో నా సంతకం ఉంటుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు, ఆర్థిక వ్యవస్థ పురోగమనం, ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత, కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 26 :** ఈనెల 30వ తేదీన ఎల్బీనగర్ నియోజకవర్గంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఎన్నికల పరిశీలకుడు రామ్ కుమార్ సదురుప్పన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంల పని తీరును గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ప్రియరంజన్ శ్రీ వాస్తవ నియోజకవర్గం ఎఫ్ఎస్ టి, ఎస్ఎస్ టి, విఎస్ టి బృందాలతో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్పెండిచర్ అబ్సర్వర్ బృందం సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు. బృందం సభ్యుల పని తీరును అభినందించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పనితీరు పకడ్బందీగా కొనసాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు రవీందర్ కుమార్, శ్రీనివాస్, బి. ప్రసాద్‌రావు పాల్గొన్నారు.